క్లుప్తంగా

గ్రంథాలయం తనిఖీ



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాస్‌చంద్రబోసు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులతో పాటు కొత్తగా వచ్చిన పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు కావాల్సిన మెటీరియల్‌పై ఆరా తీశారు.

17న పెద్దమ్మకు బోనాలు

తుగ్గలి: మండల పరిధిలోని జి.ఎర్రగుడిలో వెలసిన పెద్దమ్మ అమ్మవారి దేవర ఉత్సవాలు ఈనెల 16, 17తేదీలలో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. 16న అమ్మవారికి ప్రత్యేక పూజలు, 17న బోనాలు సమర్పణ ఉంటుందన్నారు.

వలసలు నివారించండి



ఏపీడీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ రూరల్: వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, సహాయ కార్యదర్శి సురేంద్ర, మండల అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి సిద్దయ్యగౌడ్ తదితరులు మంగళవారం ఏపీడీ వెంకటలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధి పనులు కల్పించి, కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వేగంగా భూముల రీ సర్వే

చిప్పగిరి: ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే మండలంలో వేగంగా సాగుతోంది. మంగళవారం నంచర్ల గ్రామ పరిధిలోని పొలాలను వీఆర్‌ఓ రంగన్న ఆధ్వర్యంలో సర్వేయర్ రజియా, వీఆర్‌ఏ చంద్ర సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు మండలంలో 15,000 ఎకరాల్లో రీ సర్వే పూర్తయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మద్దమాంబకు ప్రత్యేక పూజలు

మద్దికెర: మండల కేంద్రంలోని మద్దమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యే క పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, అష్టోత్తరనామార్చనతో పాటు మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



డీవైఎఫ్‌ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సీఐలు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం డీవైఎఫ్‌ఐ క్యాలెండర్–2023ను సీఐలు మధుసూదన్‌రావు, మంజునాథ్‌లతో కలిసి ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ సునీల్‌కుమార్, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, పట్టణ, మండల నాయకులు అజిత్, వీరేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప,పట్టణకార్యదర్శివిజయ్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు



పగిడిరాయిలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరిత

తుగ్గలి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో వైద్య సేవలు ప్రజల ముంగిటకే అందుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముక్కెల్లలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 104 వాహన వైద్యాధికారి కృష్ణబాబు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రధానమంత్రి మాతృత్వ యోజనలో భాగంగా పగిడిరాయి పీహెచ్‌సీలో రెండో రోజు మంగళవారం వైద్యాధికారిణి హరిత 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

పత్తికొండటౌన్: పట్టణంలోని గ్రంథాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు 'గ్రంథాలయాల అభివృద్ధి– ప్రజల భాగస్వామ్యం' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.రామ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, జిల్లా కార్యదర్శి ప్రకాశ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మరకట్టు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో తాగు నీటి ఎద్దడి, సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. అంతకుముందు గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ శ్రీరాములు, మండల కన్వీనర్ వీరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీంనాయుడు, మాజీ సర్పంచ్ గంగమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జయా ఉచ్చీరప్ప మాజీ ఎంపీటీసీ సభ్యుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

12న ఐరన్‌బండలో..

దేవనకొండ మండలం ఐరన్‌బండ గ్రామంలో ఈనెల 12న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరీదేవి మంగళవారం తెలిపారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొననున్న కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

రూ.58.20 కోట్లతో మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక మున్సిపలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.58,20,67,120లతో బడ్జెట్ రూపొందించి ఆమోదించినట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో బడ్జెట్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన బడ్జెట్ అంచనా రూ.57,85,90,620లు ఉండగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ బడ్జెట్ అంచనాలో ప్రారంభ నిల్వ రూ.27,75,30,620లు కాగా సాధారణ జమ రూ.22,97,86,500లు, మూలధన జమ రూ.రూ.7,47,50,000లుగా రూపకల్పన చేశారు. ఇందులో సాధారణ ఖర్చుల కింద రూ.15,61,42,200లు, మూలధన ఖర్చులు రూ.14,43,85,000లు, లోన్ల చెల్లింపుకు రూ.40,00,000లు వెచ్చించనుండగా మొత్తం ఖర్చుల కింద రూ.38,45,27,200లు, ముగింపు నిల్వ కింద రూ. 27,75,39,920లను ప్రతిపాదించారు. వీటికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కాగా బడ్జెట్‌లో నిబంధనల మేరకు ఎస్సీలకు, వికలాంగులకు, శిశుసంక్షేమానికి ఖర్చు పెట్టాల్సి ఉండగా మైనారిటీలకు రావాల్సిన, ఖర్చు పెట్టాల్సిన వాటిపై దృష్టి సారించాలని విపక్ష కౌన్సిలర్ దయాసాగర్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈసారి జాతరలో ఫ్లెక్సీ రహిత పట్టణంగా మార్చడంపై హర్షం వ్యక్తం చేశారు. కాగా టీడీపీ కటౌట్‌ను తొలగించి అధికార పార్టీ వారిది తొలగించకపోవడంపై ఆయన అభ్యంతరం తెలపగా అక్కడ హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్నందుకు తొలగింపు ఇబ్బందిగా మారిందని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ సమాధానం ఇచ్చారు. సమావేశంలో డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు వృషభాలు భళా



విజేతగా నిలిచిన వృషభాల యజమానికి బహుమతి అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు పళ్ల ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా కొత్తూరు వృషభాలు విజేతగా నిలిచాయి. మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృషభాల యజమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి రూ.30 వేల నగదు బహుమతిని అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా రాయపురం వృషభాల యజమాని నల్లారెడ్డికి రూ.25వేలు, మూడోస్థానం దక్కించుకున్న బ్రాహ్మణ పల్లె వృషభాల యజమాని కొప్పెర్ల జయమ్మకు రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, సోగనూరు భీమిరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

18 నుంచి అఖిల భారత మహాసభలు

వెల్దుర్తి: ఈనెల 18 నుంచి బెంగళూరులో జరుగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా నాయకుడు నగేశ్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద స్థానిక నేతలతో కలిసి మాట్లాడారు. కేంద్ర కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు మహాసభలలో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ మండల కార్యదర్శి రామానాయుడు, నాయకులు రాజు, పెద్ద ఏసు, మారెన్న, మధు, శేఖర్, మల్లి, పెద్దన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చీకటి బతుకులో.. వెలుగు పాట



పాట పాడుతున్న అంధురాలు రాధ

పత్తికొండ రూరల్: అనంతపురానికి చెందిన రాధ పుట్టుకతో అంధురాలు. బ్రెయిలీ లిపితో డిగ్రీ పూర్తి చేసింది. తనకున్న వైకల్యం కారణంగా ఎవరికీ భారం కాకూడదని భావించుకుంది. సెల్‌ఫోను ద్వారా తనకు నచ్చిన పాత పాటలు సాధన చేసి లయబద్ధంగా పాడటాన్ని నేర్చుకుని తన బతుకుకు బాటగా మలుచుకుంది. ఫుట్‌పాత్‌పై ఆర్కెస్ట్రా ఏర్పాటుచేసి దారిన వెళ్లేవారు ఇచ్చింది తీసుకుని తన బతుకుబండిని లాగిస్తోంది. చిన్నచిన్న సమస్యలకే కుంగిపోయే వారికి రాధ బతుకు పయనంలో మానవతావిలువలు, జీవిత సత్యాలు తెలియజేస్తూ పాడే పాటలు పలువురికి మేలుకొలుపే.

ఆలూరు ఎస్‌ఐ బదిలీ!

ఆలూరు రూరల్: ఆలూరు ఎస్‌ఐ రామానుజులు బదిలీ అయ్యారు. రెండేళ్ల క్రితం ఆదోని టూ టౌన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా ఈయన మంగళవారం బదిలీ అయినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు ఈయనను స్పెషల్ బ్రాంచ్‌కు పంపినట్లు సమాచారం.

ఘనంగా మారెమ్మ కుంభోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామంలో వెలిసిన మారెమ్మ దేవికి మంగళవారం మేటి కుంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఊరుబావి వద్ద గంగ పూజ నిర్వహించి అనంతరం మేటి కుంభాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయంలో దేవికి ఆకు పూజా, మహామంగళారతి, నైవేద్య సమర్పణ చేశారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

కృష్ణగిరి: ఇటీవల నిర్వహించిన స్కూల్‌గేమ్స్‌లో కంబాలపాడు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని మంగళవారం హెచ్‌ఎం శ్రీనాథ్ ఆధ్వర్యంలో పీడీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 100 మీటర్ల పరుగు అండర్ –17 విభాగంలో పదో తరగతి విద్యార్థి గణేశ్, కబడ్డీలో సాయి, కబడ్డీ అండర్ –14 విభాగంలో శ్రీకర్, హుంషు పోటీలో కార్తీక్, హరినాథ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు.

రేపు క్రికెట్ టోర్నీ

గోనెగండ్ల: సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో ఈనెల 12 నుంచి తాలూకా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామకృష్ణ, దస్తగిరి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 11వ తేదీలోపు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి 9912632217, 9885641857 సంప్రదించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మిగనూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేఆర్ మురహరరెడ్డి కార్యకర్తలకు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో తమ పార్టీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థినే గెలిపించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బీఎల్.నారాయణ, టౌన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల తొలగింపును రాజకీయం చేయొద్దు

నందవరం: క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్ల తొలగింపును రాజకీయం చేయొద్దని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు నిఖిల్ చక్రవర్తి టీడీపీ నాయకులకు హితవుపలికారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీకి చలానాలు చెల్లించకపోవడంతోనే పంచాయతీ అధికారులు ఇరు పార్టీల(వైఎస్సార్‌సీపీ, టీడీపీ) బ్యానర్లు తొలగించారన్నారు. విషయం తెలుసుకోకుండా టీడీపీ నాయకులు అధికారులకు, పోలీసులకు పార్టీని అంటగట్టడం తగదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లాగౌడ్, రమేశప్పగౌడ్, మీసాల సంపత్‌గౌడ్, చాంద్ తాత పాల్గొన్నారు.

ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలి

కృష్ణగిరి: కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రప్రభుత్వంపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె నాగేశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరగనున్న సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్రంపై ప్రతి కార్మికుడు, రైతు గళమెత్తాల్సిన సమయం వచ్చిందన్నారు. అనంతరం ఆర్‌ఐకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి రమణయ్య, ప్రతినిధులు గోపాల్, పురుషోత్తం, వెంకటశెట్టి, కుమార్, రాజు పాల్గొన్నారు.

సేవలు ప్రజలకు అందాలి

● జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు

పత్తికొండటౌన్: గ్రామ సచివాలయాల సేవలు ప్రజలకు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పత్తికొండ డివిజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్లు, ఎంపీడీఓలు సమన్వయంతో గ్రామసచివాలయాల సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి 62 రకాల సేవలుండగా.. చిప్పగిరి మండలం అత్యధికంగా 36 సేవలు అందించారన్నారు. మిగిలిన మండలాల్లో తక్కువ సేవలు అందుతున్నాయన్నారు. బిల్లుల పేమెంట్‌కు సంబంధించి 24 సేవలు ఉండగా ఆస్పరిలో 15 సేవలు అందించారన్నారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల్లో తక్కువగా 4 సేవలు మాత్రమే నమోదయ్యాయన్నారు. విద్యుత్‌శాఖకు సంబంధించి 12 సేవలు ఉండగా దేవనకొండ, హాలహర్వి మండలాల్లో ఒక్క సేవ కూడా అందించలేదన్నారు. భూహక్కు పత్రాలను వలంటీర్ లాగిన్ నుంచి త్వరగా పూర్తి చేయాలన్నారు. వీఆర్‌ఓల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థను తహసీల్దార్లు, ఎంపీడీఓలు పూర్తిగా నియంత్రణలోకి తీసుకోవాలన్నారు. వారంలో ఒకసారి సచివాలయాలను తనిఖీ చేసి, అక్కడ అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరును పరిశీలించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇళ్ల నిర్మాణం, ప్రాధాన్య భవనాల నిర్మాణం, పాఠశాలల తనిఖీలు చేపట్టేలా చూడాలన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. గ్రామసచివాలయాల సర్వీసులను పెంచి జిల్లాను రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంచేలా కృషిచేయాలన్నారు. అనంతరం మండలంలోని చిన్నహుల్తి గ్రామం జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్‌దాసు, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, తహసీల్దార్లు విష్ణుప్రసాద్, సుదర్శన్, రవి, నాగరాజు, ఎంపీడీఓలు పార్థసారథి, మహబూబ్‌బాషా, నరసింహమూర్తి, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: జగనన్నకు తోడుగా–పేద ప్రజలకు అండగా' నినాదంతో తయారు చేసిన 2023 క్యాలెండర్‌ను సేవాదల్ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీధర్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు కోటేశ్వరరావు, నాయకులు సాబ్దిన్ నూర్‌బాషా, గోవిందు, పులికొండ రామానాయుడు, చక్రాళ్ల లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ కార్యాలయంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి కారన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.రాజాసాహెబ్ తదితరులు విడుదల చేశారు.

ఉపాధి పనులు కల్పించండి



ఏపీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండటౌన్: వలసల నివారణకు ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం(సీపీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్ తదితరులు మంగళవారం డ్వామా ఏపీడీ పద్మావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో వలసలు వెళ్లే అవకాశం ఉందని, గ్రామాల్లో పనులు ప్రారంభించి ఉపాధి కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు నాయకులు కారన్న, రాజాసాహెబ్, నరసింహులు, కృష్ణయ్య, సుల్తాన్, కారుమంచి, నెట్టికంటయ్య, వెంకట్రామిరెడ్డి, మాదన్న, గిడ్డయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



బండలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎల్లమ్మ బీడు ప్రాంతంలో ఉన్న ఎన్జీఓ కాలనీలో ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. కాలనీలో 20 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని బండలు పాతారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు టీపీఓ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్య మున్సిపల్, టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది వాటిని జేసీబీలతో తొలగించారు. మున్సిపల్ అనుమతుల్లేకుండా స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీపీఓ హెచ్చరించారు.

గడ్డివామి దగ్ధం

నందవరం: మండల పరిధిలోని గురజాల గ్రామంలో మంగళవారం గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన కురువ నరసింహులు తన ఇంటి సమీపంలో పశువులకోసం గడ్డివాము వేసుకున్నాడు. మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో స్థానికులు, ఆపద మిత్ర వలంటీర్లు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. బాధిత రైతు కురవ నరసింహులు మాట్లాడుతూ దాదాపు రూ.60 వేల విలువ చేసే గ్రాసం కాలిపోయిందని వాపోయాడు.

హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

హొళగుంద: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి కేంద్రాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల నుంచి సంతకాలు సేకరణ చేపట్టారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఆర్‌ఐ దినోజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్యాట శ్రీరంగ, అధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌ను 2017లో మూసేయడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్త్రీనిధి రుణాలపై విచారణ



విచారణలో ఏజీఎం, కోఆర్డినేటర్‌లు

వెల్దుర్తి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ఇటీవల నూతన నిబంధనల మేరకు స్త్రీనిధి వ్యక్తిగతంగా రూ.లక్ష అందించిన రుణాలపై జిల్లా స్థాయి అధికారులు విచారించారు. ఏజీఎం నాగప్రసాద్, కర్నూలు ఏరియా స్త్రీనిధి కోఆర్డినేటర్ శిఖర్‌రెడ్డిలు క్షేత్రస్థాయి విచారణలో భాగంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గతంలో స్త్రీనిధి రూ.50వేలు అందించేవారని, ప్రస్తుతం 12 మంది పొదుపు గ్రూపులకు 6 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందిస్తున్నట్లు, ఇటీవల అందించిన యూనిట్లను పరిశీలించారు. రుణగ్రహీతలతో మాట్లాడుతూ సకాలంలో చెల్లించాలని సూచించారు. వారివెంట ఏపీఎం చంద్రశేఖర్ ఉన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: అన్ని వర్గాల ప్రభుత్వ పథకాలు అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మద్దికెర ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించిందన్నారు. పథకాలు దీర్ఘకాలం కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంగా ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రజలకు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తే నైపుణ్యమున్న క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం హోసూరు గ్రామంలో భద్రకాళీ వీరభద్రేశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ, సచివాలయం–2ను తనిఖీ చేశారు. వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద శివశక్తి గ్రూపు సభ్యులకు మంజూరైన సబ్సిడీ పప్పుశనగ నూర్పిడి యంత్రాన్ని రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ మురళీమోహన్, ఎంపీపీ నారాయణదాసు, హోసూరు సర్పంచ్ నాగప్ప, ఎంపీటీసీ సభ్యుడు కేశప్ప, ఉపసర్పంచ్ విజయభాస్కర్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు బనగాని శ్రీనివాసులు, బళ్లారి మోహన్‌క్రిష్ణ, శాంతిరెడ్డి, లాల్ బాషా, వడ్డే లక్ష్మన్న, నాగిరెడ్డి పాల్గొన్నారు.